


మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 251
పేజీలు : 3

శుక్రవారం
10.04.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


# ఆర్టీసీలో సమ్మె సైరన్

**- ఈనెల 23 తర్వాత ఎప్పుడైనా బంద్**



**టి మీడియా, ఏప్రిల్ 9, హైదరాబాద్ బ్యూరో :** ఈనెల 23 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్లే అవకాశం ఉందని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్? థామస్ రెడ్డిలు స్పష్టం చేశారు. ఆర్టీసీక్రాస్ రోడ్?లోని కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ డిపార్ట్?మెంట్ అధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు ఇవాళ సమావేశమయ్యారు. దీనికి ఆర్టీసీ అధికారులు రాకపోవడంతో సమ్మెపై పూర్తిస్థాయిలో చర్చ జరగలేదని జేఏసీ నేతలు తెలిపారు. ఈనెల 13వ తేదీన మరోసారి లేబర్ కమిషనర్, ఆర్టీసీ యాజమాన్యంతో చర్చలు ఉంటాయని ఆతర్వాత సమ్మెపై పూర్తిస్థాయిలో స్పష్టత వస్తుందని జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించి తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కార్మిక శాఖకు, తమ యాజమాన్యానికి సమ్మెనోటీస్ ఇచ్చామని తెలిపారు.


## అసోం, కేరళ, పుదుచ్చేరిలో..

# ప్రశాంతంగా ఎన్నికలు

**కేరళలో సాయంత్రం 5 గంటల వరకు 75.01శాతం**








### - అసోంలో 84.42 శాతం

**టి మీడియా, ఏప్రిల్ 9, ఢిల్లీ బ్యూరో :** అసోం, కేరళ, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చినట్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఈసీ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో చెదురుమొదురు ఘటనలు మినహా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూర్తయ్యాయి. ముఖ్యమంత్రులతో పాటు పలువురు ప్రముఖులు వేర్వేరు చోట్ల ఓటు వేశారు.

**ప్రశాంతంగా ముగిసిన కేరళ అసెంబ్లీ ఎన్నికలు**

కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలిరాగా, ముగిసే సమయానికి క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఇచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు 75.01శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి స్వల్పంగా పెరిగిందని వివరించింది. కేరళలో 140 అసెంబ్లీ స్థానాలు ఉండగా, 883 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కన్నూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువాయూర్ దేవస్థానం పాఠశాలలో కేంద్ర మంత్రి సురేశ్? గోపీ ఓటు వేశారు. ఎర్నాకులంలోని కేసరి ప్రభుత్వ కళాశాలలో ప్రధాన ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అభ్యర్థి వీడీ సతీషన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నెమామ్ స్థానం అభ్యర్థి రాజీవ్ చంద్రశేఖరన్ తిరువనంతపురంలో ఓటు వేశారు. తిరువనంతపురంలోనే సినీ నటుడు మోహన్ లాల్ ఓటు వేశారు. నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఎర్నాకులంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్ల కోసం 30 వేల 495 పోలింగ్ కేంద్రాలను ఈసీ అధికారులు ఏర్పాటు చేశారు. సుమారు 1.46 లక్షల మంది అధికారులు, 76 వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలు విధులు నిర్వర్తించారు.

**అసోంలోని 126 నియోజకవర్గాల్లో బరిలో నిలిచిన 722 మంది అభ్యర్థులు**

మరోవైపు అసోం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. అసోంలో సాయంత్రం 5 గంటల వరకు 84.42 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతిచ్చారు. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ జరిగింది. అసోంలోని 126 నియోజకవర్గాల్లో 722 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వారిలో 59 మంది మహిళలున్నారు. 2.5 కోట్ల మంది ఓటర్ల కోసం 31 వేల 490 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 16వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గువాహటిలో ఓటు వేశారు. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ జోర్హాట్ లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అసోంలో వేర్వేరు చోట్ల పలువురు ప్రముఖులు ఓటు వేశారు. అసోంలో కాంగ్రెస్ 99స్థానాల్లో, బీజేపీ 90చోట్ల పోటీపడుతున్నాయి.

**సాయంత్రం 5 గంటల వరకే 86.92 శాతం పోలింగ్**

కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకే 86.92 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఇచ్చారు. 30 అసెంబ్లీ స్థానాలున్న పుదుచ్చేరిలో 294మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ముఖ్యమంత్రి రంగస్వామి బులెట్ బండిపై వచ్చి దెలార్ష్‌పేటలో ఓటు వేశారు. మాజీ సీఎం, కాంగ్రెస్ నాయకుడు నారాయణ స్వామి పుదుచ్చేరిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.



## రేషన్ దుకాణాల వద్ద

# నో స్టాక్ బోర్డులు

- **మూడు నెలల బియ్యంపై భయం భయం**

**టి మీడియా, ఏప్రిల్ 9, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేపడుతోన్న విషయం తెలిసిందే. అయితే రేషన్ బియ్యం పంపిణీకి అనుగుణంగా బియ్యం సరఫరా ఉండటం లేదని లబ్ధిదారులు, డీలర్లు అంటున్నారు. 3 నెలల కాలానికి సంబంధించిన బియ్యం చౌకధరల దుకాణాల్లో నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడం ఒక కారణం కా,గా మరోవైపు రేషన్? దుకాణంలో నిండుకున్న నిల్వల స్థానంలో కొత్త కోటా విడుదల చేసే అవకాశం లేకపోవడంతో దుకాణాల ముందు నో స్టాక్ బోర్డ్ పెట్టాల్సిన పరిస్థితి తతెత్తుతోందని డీలర్లు వెల్లడిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్, మే, జూన్ నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నారు.

**రేషన్ దుకాణాల వద్ద నో స్టాక్ బోర్డు**

కరీంనగర్ జిల్లాలో 566 రేషన్ దుకాణాలుండగా 3 నెలల కాలానికి 17,000 టన్నుల బియ్యం రవాణా చేయాల్సి ఉంది. జిల్లా పౌరసరఫరాల సంస్థ ఇప్పటికే 11,000 టన్నుల బియ్యం రవాణా చేసింది. జిల్లాలో 65 శాతం బియ్యం రవాణా పూర్తైంది.ఈ రేషన్ బియ్యం వచ్చిన వెంటనే లబ్ధిదారులు పెద్ద ఎత్తున ఎగబడుతున్నారు. 3 నెలల కాలానికి బియ్యం ఏకకాలంలో తూకం వేసి ఇస్తుండటంతో కొద్దిసేపటికే నిల్వలు నిండుకుంటున్నాయి.నిండుకున్న బియ్యం స్థానంలో కొత్తవి తీసుకురావడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు.ప్రస్తుతం ఉన్న వాహనాలు, అదే హమాలీ కార్మికులతో 3 నెలల బియ్యం రవాణా చేయాల్సి వస్తోందని, దీంతో వారు ఏబీసీడీ ఇలా చౌకధరల దుకాణాలను వర్గీకరించి రోజుకో ప్రాంతానికి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇలా చేస్తుండటంతో ముందుగా రేషన్? బియ్యం నిల్వలు నిండుకున్న దుకాణాలకు 3 రోజులు అవుతున్నా రావడం లేదని తెలుస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆ రేషన్? దుకాణాల వద్దకు వచ్చి నో స్టాక్ బోర్డు చూసి వెనుదిరుగుతున్నారని సమాచారం.

**నో స్టాక్ బోర్డులు**

చౌకధరల దుకాణాలు అద్దెకు తీసుకునే సమయంలో వారి కోటా సామర్థ్యానికి అనుగుణంగా దుకాణాలను అద్దెకు తీసుకున్నారు. ప్రభుత్వం 3 నెలల కాలానికి బియ్యం ఏకకాలంలో పంపిణీ చేపడుతుండటంతో రేషన్ దుకాణాలు సరిపోవడం లేదని అంటున్నారు. నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటంతో 3 నెలల బియ్యం నిల్వ చేయలేకపోతున్నారని అన్నారు. దీంతో పాటు రేషన్ బియ్యం నిండుకోవడంతోనే నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

# ఎమ్మెల్యే పల్లానే బురిడీ కొట్టించిన సైబర్ కేటుగాడు

- **వికసిత్ భారత్' పేరు చెప్పి రూ.లక్ష కాజేశాడు**

**టి మీడియా, ఏప్రిల్ 9, హైదరాబాద్ బ్యూరో :** సాంకేతిక ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో అదే రీతిలో ఆన్?లైన్? మోసాలూ పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు కొత్త దారులు వెతుక్కుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ ముఠాల ఉచ్చుకు నిరక్ష్యరాస్యులు బలైతే వారికి ఇలాంటి విషయాలపై అంతగా అవగాహన లేదులే అని అర్థం చేసుకోవచ్చు. కానీ ఇలాంటి మోసాలకు విద్యావంతులు, రాజకీయ నాయకులు సైతం బలవుతూనే ఉన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ పథకం పేరుతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డికి మాయమాటలు చెప్పి సైబర్ కేటుగాడు రూ.లక్ష దోచుకున్నాడు. తాను మోసపోయానని గుర్తించిన ఆయన సైబర్? క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అసలింతకీ ఏం జరిగింది? సైబర్ మోసాల బారిన పడకుండా ఉంటడం ఎలా అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**పోలీసుల కథనం ప్రకారం**

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సైబర్ మోసం వెలుగుచూసింది. కేంద్రప్రభుత్వ స్కీం పేరుతో మోసగాడు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డిని మోసం చేసి రూ.లక్ష దోచుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం... జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్‌లో నివసిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డికి ఆదివారం ఉదయం ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తాను తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖలో



అదనపు కార్యదర్శి అనంత రామిరెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన "వికసిత్ భారత్" పథకం కింద రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉందని చెప్పాడు. మీ నియోజకవర్గంలో అర్హులైన 40 మంది జాబితా పంపిస్తే వెంటనే మంజూరు చేయిస్తానని, అదే రోజు చివరి తేదీ అని నమ్మబలికాడు.

**పోలీసులకు పల్లా ఫిర్యాదు :** ప్రతి దరఖాస్తుకు రూ.2,500 చొప్పున మొత్తం రూ. లక్ష ఫోన్‌పే ద్వారా పంపించాలని కోరడంతో ఎమ్మెల్యే వెంటనే డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేశారు. అనంతరం తన పీఏకు 40 మంది లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. కొంతసేపటి తర్వాత అసలైన ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శికి ఫోన్ చేసి డబ్బులు అందాయా అని అడగగా, తాను ఎలాంటి డబ్బులు పొందలేదని, ఇది మోసం అయి ఉంటుందని తెలిపారు. ఆ రోజు ఆదివారం కావడంతో తాను ఇంట్లోనే ఉన్నానని చెప్పడంతో ఎమ్మెల్యే మోసపోయిన విషయం గ్రహించారు. వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. నకిలీ అధికారిగా నటించి "వికసిత్ భారత్" పథకం పేరుతో మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రజల ఆస్తులకు

# భద్రతే లక్ష్యం

- **అందుకే కొత్త పాసు పుస్తకాలు: సీఎం చంద్రబాబు**



**టి మీడియా, ఏప్రిల్ 9, బాపట్ల :** భూమి అనేది కేవలం ఆస్తి మాత్రమే కాదని అది జీవనాధారం, భద్రత, గౌరవమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే లక్ష్యంతోనే పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నట్లు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ఇక్కడకు వచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. మీ సంతోషంతో నా జన్మ ధన్యమైంది: పట్టాదారు పాస్‌పుస్తకం తమ చేతికందినప్పుడు ప్రజల్లో కలిగిన సంతోషం చూసి జన్మ ధన్యమైందని సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం ఎంత విధ్వంసం అవ్వాలో అంత అయిందని, వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకండా పోయిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయన్న సీఎం వాటిని ఇప్పుడు కూటని ప్రభుత్వం దారిలో పెడుతూ వస్తుందన్నారు.జూలై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు: గత ప్రభుత్వంలో నాయకులు ప్రజల భూమిపై కన్నేశారని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని, పట్టా పుస్తకంపైన జగన్ ఫొటో వేసుకున్నారని గుర్తు చేశారు. ఆస్తి మీదైతే- ఫొటో ఆయనది ఉండేదని అన్నారు. గత పాలకులు చేసిన అక్రమాలు, పాపాలు ఇప్పటికీ ఇంకా వెంటాడుతున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. గత పాలకులు చేసిన పనులు చూస్తే మతిపోయిందని, నూటికి 90 శాతం రెవెన్యూ సమస్యలపైనే ఆర్జీలు వచ్చేవని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మీకు భూ హక్కు ఇచ్చే బాధ్యత తీసుకోవాలని అప్పుడే సంకల్పించినట్లు చంద్రబాబు తెలిపారు. 1.12 కోట్ల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. 16,816 గ్రామాలు రీ సర్వే చేయాలన్నారు. ఇప్పటికే 21.23 లక్షల కొత్త పాస్ పుస్తకాలు ప్రజలకు ఇచ్చామని తెలిపారు. జూలై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంకా 80 లక్షల పాస్ పుస్తకాలు ఇవ్వాలని చంద్రబాబు వివరించారు.



# సమస్యల గురించి మాట్లాడే నాయకుడు జీవన్ రెడ్డి

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**టి మీడియా, ఏప్రిల్ 9, జగిత్యాల:** ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పడి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్లాంటిదంటే.. కేసీఆర్ రూ.70 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు..

**కాంగ్రెస్‌లోనే కొనసాగారు..**

2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు.. కాంగ్రెస్‌లోనే కొనసాగారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల చాలా గట్టిగా మాట్లాడే

మిగతా 3లో..




# మధిర ప్రాంత అభివృద్ధే లక్ష్యం...

**• -డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**





**టీ మీడియా, ఏప్రిల్ 9, మధిర :** మధిర ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క గురువారం మధిర ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు తెలంగాణ నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా సి.ఆర్.ఆర్. (2025-26) 7 కోట్ల 71 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన అంబారుపేట మాటూరుపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 10 కోట్ల 60 లక్షల నిధులతో చేపట్టిన మల్లారం నుంచి మిట్ట గూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు, అదేవిధంగా మధిర పట్టణంలో విద్యుత్ శాఖకు సంబంధించి నూతన ఇ.ఆర్.ఓ. కార్యాలయ భవన నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. మధిర అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి గ్రామ, పట్టణాల అభివృద్ధి ప్రభుత్వానికి ప్రాధాన్యమని, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, మౌళిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు సులభ రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ రహదారి పనులకు సుమారు రూ. 18 కోట్ల 30 లక్షలు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన తర్వాత రైతులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు మధిర పట్టణంలో నూతన ఇ.ఆర్.ఓ. కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## అంబలి కేంద్రం ఏర్పాటు

**టీ మీడియా, ఏప్రిల్ 8, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సౌజన్యంతో అంబలి కేంద్రం, చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఈ అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. మండుతున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని వివిధ పనుల నిమిత్తం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఈ అంబలి కేంద్రం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఇట్టి అంబలి కేంద్రాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల తిరుపతయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మాజీ కౌన్సిలర్లు బ్రహ్మం చారి, కదిలే రాములు, క్యాంపు కార్యాలయం సిబ్బంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాత గంజ్ మార్కెట్ యార్డు ప్రారంభించాలి

**-జన సమితి జిల్లా అధ్యక్షులు యంఏ.ఖాదర్ పాష**



**టీ మీడియా, ఏప్రిల్ 9, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ యార్డు ఆవరణలో కోట్ల రూపాయల ప్రజా ధనంతో నిర్మించిన భవనం (టౌన్ హాల్) నేటికీ ప్రారంభోత్సవానికి నోచుకోకుండా నిరుపయోగంగా పడి ఉండటంపై తెలంగాణ జన సమితి పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.?ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు యం.ఏ,ఖాదర్ పాష మాట్లాడుతూ, పట్టణ నడిబొడ్డున ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ టౌన్ హాల్ అందుబాటులోకి రాకపోవడం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా, భవనాలు పూర్తయినా వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని స్పష్టంగా కనిపిస్తోందని వారు మండిపడ్డారు. ముఖ్యంగా స్థానిక జిల్లా అధికారులు,? స్థానిక శాసనసభ్యులు తుడి మేఘారెడ్డి ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి, ఈ విషయంపై తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించి టౌన్ హాల్‌ను ప్రారంభించాలి. ప్రజాధనం వృథా కాకూడదు కాకూడదని కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ కట్టడం నిరుపయోగంగా ఉంటే శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది. దీన్ని వెంటనే ప్రజా అవసరాలకు కేటాయించాలనిఅధికారుల తక్షణమే మార్కెటింగ్ శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ అడ్డంకులను తొలగించాలి.?ప్రజల ఆస్తిని ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని ప్రజల ప్రజాధనం వృధా చేయడంలో ప్రజా ప్రతినిధులు విఫలం కాకూడదని, తక్షణమే ఈ టౌన్ హాల్‌ను ఓపెన్ చేయకుంటే తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేప చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షఫీ, జిల్లా ఉపాధ్యక్షులు గండు శి, టౌన్ ప్రధాన కార్యదర్శి శాంతారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# భర్తను హతమార్చిన భార్య



**టి మీడియా, ఏప్రిల్ 9, మేడ్చల్ :** తాగిన మత్తులో ఓ భార్య దారుణానికి ఒడిగట్టింది. తన సోదరుల సాయంతో కట్టుకున్న భర్తను చీరతో ఉరివేసి, తలను నేలకేసి కొట్టి చంపేసింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అన్నోజిగూడలో ఈ దారుణ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ గ్రామం నార్లకుంట తండాకు చెందిన జటావత్ నరేందర్(40)కు 16 ఏళ్ల క్రితం సోనీతో వివాహం జరిగింది. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చిన దంపతులు అన్నోజిగూడలోని లక్ష్మీనరసింహ కాలనీలో నివసిస్తూ కూలీ పనులు చేసుకుంటున్నారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరిలో కుమారుడు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాడు. కుమార్తె తల్లిదండ్రుల దగ్గరే ఉంటుంది. కాగా, నరేందర్, సోనీ ఇద్దరికి మద్యం సేవించే అలవాటు ఉందివారి సంపాదన మొత్తం తాగడానికే ఖర్చవుతుండటంతో కుటుంబపోషణ కష్టమైంది. అదే విషయంలో తాగిన మత్తులో ఇద్దరు గొడవపడేవారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నరేందర్ నిద్రపోయిన తర్వాత తన సోదరులు నానావత్ రమేశ్, నానావత్ భాస్కర్ల సహకారంతో నరేందర్ మెడకు చీరతో ఉరివేసి, తలను నేలకేసి కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో నరేందర్ మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్రాన్స్‌జెండర్ల ధర్నా

**టి మీడియా, ఏప్రిల్ 9, నాగర్ కర్నూల్ :** ట్రాన్స్ జెండర్ల హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాన్స్ జెండర్స్ భారీ ధర్నా నిర్వహించారు. ఈ చట్టం తమకు అనుకూలంగా లేదని వాపోయారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాజంలో తమకు సమాన హక్కులు కల్పించాలని కోరారు. వివక్ష లేకుండా గౌరవప్రదమైన జీవనం కావాలని, ట్రాన్స్ జెండర్ల కోసం చట్టాల్లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

## ఏసీబీ వలలో ఫారెస్టు రేంజ్ అధికారి, జూనియర్ అసిస్టెంట్



**టి మీడియా, ఏప్రిల్ 9, ఆదిలాబాద్ :** జిల్లాలో బోథ్ ఫారెస్టు రేంజ్ అధికారి , జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు. హరిత హారంలో జాతీయ గ్రామీణ హామీ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన చెక్ డ్యాంలో నీటిని నింపిన బాధితుడికి సుమారు రూ.5లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగిన బాధితుడు చివరకు బోథ్ ఫారెస్టు రేంజ్ అధికారి టి. ప్రణయ్ రూ. 15 వేల డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు జూనియర్ అసిస్టెంట్ పరుశురాంకు రూ.15 వేలు ఇస్తుండగా ఏసీబీ పట్టుకుంది. విచారించగా ఎఫ్ఆర్వో ఆదేశాల మేరకు డబ్బు తీసుకున్నట్లు అంగీకరించడంతో ఇద్దరిని కస్టడీలోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

## రాందేవ్ రెడ్డి 21వ వర్ధంతి సందర్భంగా నివాళులు



**టీ మీడియా ,ఏప్రిల్ 9, పెబ్బేరు :** గురువారం పెబ్బేరు మండలం లోని కంచిరావపల్లి గ్రామంలో ఊరు మెచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత పుల్లూరు రాందేవ్ రెడ్డి ఎక్స్ జెడ్ పి టి సి 21వ వర్ధంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించిన పెబ్బేరు పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ దివ్యా రెడ్డి ఎ ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు అలాగే గ్రామంలోని రాందేవ్ రెడ్డి చౌరస్తాలో రాందేవ్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణా జైపాల్ రెడ్డి పెబ్బేరు ఎస్ ఐ ఎ ఎస్ ఐ గ్రామ కాగ్రెస్ నాయకులు అభిమానులు పెద్దఎత్తున పాల్గొనడం జరిగింది.

## భజన ఆశ్రమానికి భూదానం



**టీ మీడియా ,ఏప్రిల్ 9,పాపన్నపేట:** పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో శ్రీ శివరామ దీక్షితుల భజన ఆశ్రమ నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన ముగ్గురు దాతలు రెండు గుంటల భూమిని దానం చేసినట్లు భజన మండలి సభ్యులు డాక్టర్ అవుసుల నర్సింలు వెల్లడించారు . అదే గ్రామానికి చెందిన వడ్డేపల్లి జయరాం రెడ్డి, తో పాటు బైండ్ల నారాయణ, అదృష్ట సోదరులు భూదానం చేసినట్లు ఆయన తెలిపారు, కాగా ఆశ్రమ నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన డాక రెడ్డి గారిమధుసూదన్ రెడ్డి తో పాటు స్థానికులు ఆర్థిక సాయం అందజేశారని, ఇందుకు సహకరించిన దాతలకు స్థానిక సర్పంచ్ అనిత నరేందర్ రెడ్డి , శివరామ దీక్షితుల శిష్యులతో పాటు భజన మండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు .

## సైనిక్ స్కూల్ కి ఎంపికైన అల్లం తనిష్ వర్మ



**టీ మీడియా, ఏప్రిల్ 9, రామకృష్ణాపూర్:** రామకృష్ణాపూర్ గద్దెరాగడి కి చెందిన అల్లం తనిష్ వర్మ ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఏర్పాటుచేసిన ప్రవేశ పరీక్షలో మొదటి కౌన్సిలింగ్ లో ఎంపికై గుజరాత్ లోని శ్రీ బ్రహ్మానంద్ విద్యా మందిర్ సైనిక్ స్కూల్ లో స్థానం సంపాదించాడని తల్లిదండ్రులు అల్లం తిరుపతి ,సృజన తెలిపారు. కాగా ప్రస్తుతం తమకుమారుడు మంచిర్యాలలోని పల్లవి మోడల్ స్కూల్ లో చదువుతున్నాడని సైనిక్ పాఠశాలలో స్థానం పొందినందుకు తమకు ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

## సిసి రోడ్డు పనుల ప్రారంభం



**టీ మీడియా ఏప్రిల్ 9, టేక్మాల్:** టేక్మాల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ వాసుల దశాబ్దాల కల నెరవేరుతోంది. కాలనీలో రోడ్డు మార్గం అధ్వాన్నంగా మారి, వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న విషయాన్ని స్థానిక నేతలు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించిన మంత్రి, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ. 5 లక్షలు మంజూరు చేశారు. మంత్రి నిధులు మంజూరు చేసిన వెంటనే, టేక్మాల్ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్ మరియు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదల కష్టాలను గుర్తించి వెంటనే నిధులు కేటాయించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ కి టేక్మాల్ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది, అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకలకాడి శంకరయ్య, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ షేక్ మజహర్, డిసిసి జనరల్ సెక్రటరీ ఆశిల సాగర్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, టౌన్ ప్రెసిడెంట్ బత్తుల కిషోర్, వార్డ్ మెంబర్లు శివ గౌడ్, సాకలి యాదయ్య మరియు కాంగ్రెస్ నాయకులు కేశి రెడ్డి, సోలాపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మంజూరు చేసిన రూ. 5 లక్షల నిధులతో టేక్మాల్ ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేశారు.

## ఏసీబీకి చిక్కిన ఆర్ఐ



**టి మీడియా, ఏప్రిల్ 9, పెద్దపల్లి :** జిల్లాలోని అంతర్గాం మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సెదంక శ్రీమాన్‌లంచంతీసుకుంటూ ఏసీబీ ( ాజదీ ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. భూభారతి చట్టం, 2025 ప్రకారం, ఫిర్యాదుదారు తల్లికి చెందిన భూమికి సంబంధించి క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి నివేదికను తహసీల్దార్‌కు పంపించాలని ఆర్ఐను కోరగా అందుకు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం తహసీల్ కార్యాలయం లో రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా కరీంనగర్ యూనిట్‌కు చెందిన ఏసీబీ అధికారులకు చిక్కాడు. అతడిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పర్చామని అధికారులు వివరించారు.




## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రారంభము

**టీ మీడియా. ఏప్రిల్ 9 .పెబ్బేరు:** గురువారం పెబ్బేరు పట్టణంలోనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పీ వి వ్యాక్సిన్ 14 సంవత్సరముల నుండి 15 సంవత్సరముల లోపు బాలికలందరికీ వ్యాక్సిన్ వేయించుకోవాలని డాక్టర్ సుధారాణి అన్నారు ఇట్టి వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం ఒక అవకాశం ముందు జాగ్రత్త కోసం ఒక అడుగు వేద్దాము ఈ వ్యాక్సిన్ మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచంగా ఉంటుంది ప్రతిరోజు పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పీ వి వ్యాక్సిన్ ఉంటుంది మండల మరియు పట్టణ ప్రజలందరూ వినియోగించుకోగలరని కోరుతున్నాము వ్యాక్సిన్ కు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు తీసుకొని రాగలరు ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ లీలమ్మ హెల్త్ సూపర్వైజర్ పార్వతి స్వరూపరాణి హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ నర్సింగ్ ఆఫీసర్ ఊర్మిళ ఫార్మసి ఆఫీసర్ కుమారి డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్లు అందజేసిన మున్సిపల్ చైర్మన్

**టీ మీడియా ఏప్రిల్ 9 ,పెబ్బేరు :** గురువారం పెబ్బేరు మున్సిపాలిటీలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింత వేగంగా తీసుకెళ్లడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లకు ఆయన స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరిచేందుకు లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఈ మొబైల్ ఫోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు గర్భిణులు బాలింతలు చిన్నారుల ఆరోగ్య గణాంకాలను నమోదు చేయడంలో ఇకపై జాప్యం ఉండదని ఆయన పేర్కొన్నారు మొబైల్ ఫోన్ల పంపిణీ పట్ల అంగన్వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తూ తమ పని భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దాసరి జములమ్మ పర్వీన్ షకీల్ తాటికొండ కృష్ణ శివ సాయి భాగ్యలక్ష్మి శివ శివ ప్రసాద్ రెడ్డి హరి శంకర్ నాయుడు మన్యం సిడిపిఓ సభిత అంగన్వాడీ టీచర్లు భారతమ్మ వెంకటేశ్వరమ్మ పి నిర్మల ఉమామహేశ్వరి ప్రేమలత స్వర్ణలత రాధమ్మ స్వరూప రాణి పాల్గొన్నారు


# ఇస్త్రీ చేసే వ్యక్తికి రోజుకు రూ.500 ఆదాయం

## - రూ.598 కోట్ల ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసులు

**టి మీడియా, ఏప్రిల్ 9, రాజస్థాన్ :** రోజంతా కష్టపడి దాదాపు రూ.500 సంపాదించే దుస్తులు ఇస్త్రీ చేసే వ్యక్తికి ఏకంగా రూ.598 కోట్లు ఆదాయపు పన్ను కట్టాలంటూ నోటీసులు వచ్చాయి. వినడానికి వింతగా ఉన్నా ఈ ఘటన రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగింది. ఈ ఐటీ నోటీసులు చూసి దుస్తులు ఇస్త్రీ చేసే వ్యక్తి షాక్ తిన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### అసలేం జరిగిందంటే?

అజ్మీర్‌లోని రామ్‌నగర్‌కు చెందిన జితేంద్ర కుమార్ బడోలియా దుస్తులు ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి 2026 ఏప్రిల్ 1న ఆదాయపు పన్ను శాఖ రూ. 598 కోట్ల నోటీసు జారీ చేసింది. ఆ నోటీసును చూసి జితేంద్ర తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. వెంటనే ఒక న్యాయవాదిని సంప్రదించాడు. ఆ తర్వాత అసలు విషయం బయటపడింది. పాలీకి చెందిన ఒక వ్యాపారవేత్త జితేంద్ర పోగొట్టుకున్న పాన్ కార్డును దుర్వినియోగం చేసి అతడి పేరు మీద వజ్రాల వ్యాపార లావాదేవీలు నిర్వహించినట్లు తేలింది. ఆ తర్వాత పాలీకి చెందిన వ్యాపారవేత్త శత్రుఘ్నన్ సింగ్‌పై గంజ్ పోలీస్‌స్టేషన్‌లో జితేంద్ర ఫిర్యాదు చేశాడు. ఇస్త్రీ చేసుకుని జీవనం సాగించే జితేంద్ర బడోలియాకు ఈ ఏడాది ఏప్రిల్ 1న రూ. 598 కోట్ల పన్ను చెల్లించాలని ఐటీ నోటీసులు అందాయని ఆయన తరపు న్యాయవాది రాకేశ్ థాడా తెలిపారు. జితేంద్ర పేరిట



ANNEXURE

1. In your case, information has been received which is flagged on Insight Portal under the category of High-Risk Transaction information on Insight Portal. As per the information received in the case of M/s Manan Enterprises (Prop. Satrudhan PAN-EAOPS8188D). It is found that M/s Manan Enterprises has made huge transactions with the various entities in the bank account no 2202135000011113 maintain with the Karur Vysya Bank Ltd. In this case multiple customers are working together as a group by opening multiple accounts in different name. The turnover in all the accounts is significantly large and at the end the account is left with negligible /low balance. These types of transactions give an indication that the customer is using the banking system as a transit point to move the funds.

2. In this regard, the scale of the transactions entered by M/s Manan Enterprises (Prop. Satrudhan) does not support the financial condition of itself and yourself and it provides only accommodation entries. All the transactions of this entity are suspicious and it appears that it has formed this entity with the intention of providing accommodation entries and stashing the unaccounted income abroad. Further, on perusal of the information it is gathered that you are also one of the beneficiaries of the same and you have also made these types of transactions with the M/s Manan Enterprises.

3. In this regard, as per the information available M/s Manan Enterprises Prop. Satrudhan purchases goods from you. The details are here as under:-

| S. No. | Information Description | Party Name | Amount (Rs.) |
|---|---|---|---|
| 1. | Total Purchases | Shri Jitendra Kumar Badoliya (FTVPB7701J) | 598,50,37,726/- |
| | TOTAL | | 5,98,50,37,726/- |

4. In view of the above, it is clear that you were engaged in various financial activities during the year under consideration. Further, it is noticed that you have not filed your Return of Income for the year under consideration and in absence of Return of Income, the said transaction(s) remains undisclosed and, therefore, the same has/have not been offered for tax and due tax has not been paid.

5. Further, your business transactions and various credit/debit entries amounting to



598,50,27,726 కోట్ల ఆదాయపు పన్ను బకాయి ఉందని ఆ నోటీసులో ఐటీ అధికారులు పేర్కొన్నారని అన్నారు. ఆదాయపు పన్ను శాఖ నోటీసును అందుకున్న వెంటనే జితేంద్ర, ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు, మనోవేదనకు గురయ్యారని వెల్లడించారు. ఆ తర్వాత జితేంద్ర తనను సంప్రదించాడని, నోటీసును పరిశీలించి దాని ప్రామాణికతను నిర్ధరించుకోవడానికి ఆదాయపు పన్ను శాఖ కార్యాలయానికి వెళ్లిన తర్వాతే అసలు నిజం బయటపడిందని చెప్పారు.

### 'పాన్ కార్డు దుర్వినియోగం చేసి లావాదేవీలు'

"జితేంద్ర కుమార్ బడోలియా పాన్ కార్డు కొన్నాళ్ల క్రితం పోయింది. దాన్ని పాలికి చెందిన శత్రుఘ్న సింగ్ దుర్వినియోగం చేసి జీఎస్టీ రిజిస్ట్రేషన్ నంబరు పొందాడు. అంతేకాకుండా జితేంద్ర పేరుతో వజ్రాలు, ఆభరణాల విక్రయాలు జరిపాడు. ఐటీ శాఖ నుంచి వచ్చిన నోటీసుకు సమాధానంగా మేము ఒక అధికారిక న్యాయపరమైన వివరణను సమర్పిస్తాం. ఈ ఘటనపై బాధితుడైన జితేంద్ర కుమార్ బడోలియా గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సంబంధిత బ్యాంకుకు కూడా ఒక నోటీసు పంపిస్తాం. " అని న్యాయవాది రాకేశ్ థాడా పేర్కొన్నారు.

### పోలీసులకు ఫిర్యాదు

తన పాన్ కార్డును దుర్వినియోగం చేసి కోట్లాది రూపాయల విలువైన అక్రమ ఆర్థిక లావాదేవీలు నిర్వహించారని ఆరోపిస్తూ జితేంద్ర కుమార్ తమకు ఫిర్యాదు చేశారని గంజ్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. రూ.598 కోట్ల పన్ను చెల్లించాలని రాజేంద్రకు ఐటీ నోటీసులు జారీ అయ్యాయని వెల్లడించారు.




## "ఫోటో ఫన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**టీ మీడియా ఏప్రిల్ 9, టేక్మాల్ ప్రతినిధి:** వేసవి తీవ్రత దృష్ట్యా సామాన్యుల దాహార్తిని తీర్చేందుకు టేక్మాల్ పట్టణానికి చెందిన ఫోటో ఫన్ ఫ్లెక్సీ సంస్థ నిర్వాహకులు ముందడుగు వేశారు. స్థానిక బస్ స్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్ గురువారం ఘనంగా ప్రారంభించారు. అన్ని దానాల కన్నా జలదానం గొప్పది" అనే సూక్తిని మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నారు ఫోటో ఫన్ సంస్థ అధినేతలు షేక్ మజ్జాహర్, షేక్ బాబా షేక్ అషీఫ్. నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ, కష్టపడి పైకి వచ్చి, తాము సంపాదించిన దానిలో కొంత భాగాన్ని ప్రజా సేవకు వినియోగించడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా వేసవి కాలంలో తమ స్టూడియో పక్కనే చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ ఈ ముగ్గురు అన్నదమ్ములు పట్టణ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మండల కేంద్రమైన టేక్మాల్‌కు నిత్యం వందలాది మంది ప్రజలు, విద్యార్థులు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. మండుతున్న ఎండల్లో వీరికి ఈ చలివేంద్రం ఎంతో ఊరటనిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో మజ్జాహర్ సోదరులు చేస్తున్న ఈ సేవ అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బత్తుల వీరన్న, మెదక్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి ఆశల సాగర్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, టౌన్ ప్రెసిడెంట్ బత్తుల కిషోర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీటీసీ కమ్మరి సిద్దయ్య, వార్డు మెంబర్ శివయ్య, మాజీ ఉపసర్పంచ్ శివయ్య, కెసి రెడ్డి, సాకలి యాదయ్య, యాదన్న, సోలాపూర్ రాజు, ధనంజయ, కొత్త అరవింద్ తదితరులు పాల్గొని నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.

## అంగన్‌వాడి టీచర్‌ను చెట్టుకు కట్టేసిన గ్రామస్తులు

**టి మీడియా, ఏప్రిల్ 9, సంగారెడ్డి:** భర్త తీసుకున్న అప్పు చెల్లించలేదనే కోపంతో అంగన్‌వాడి టీచరైన ఓ మహిళను అప్పిచ్చిన వ్యక్తులు గ్రామం నడి ఒడ్డున ఉన్న చెట్టుకు కట్టేసిన ఘటన సిద్దిపేట జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా కంగి మండలం రాసోల్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. పంచమహల్ దామరిగిద్ద గ్రామానికి చెందిన వసంతకుమారి, రాసోల్ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. అయితే ఆమె భర్త ప్రభాకర్ రావు, గతంలో హెచ్‌బీఎన్ ఫైనాన్స్ పేరిట గ్రామస్తుల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ ఈ నెల 7వ తేదీన టీచర్ విధుల్లో ఉండగా కొంతమంది బాధితులు ఆమెతో గొడవకు దిగారు. ఫైనాన్స్ వ్యవహారం కోర్టులో ఉందని, తనకు సంబంధం లేదని ఆమె వారికి చెప్పేందుకు ప్రయత్నించింది. అయితే బాధితులు మాత్రం అవేవి పట్టించుకోకుండా ఆమెతో వ్యవహరించారు. ఆవుటి బండెప్ప, కోటగిరి రాములుతో పాటు మరికొందరు కలిసి వసంతకుమారిని బలవంతంగా చెట్టుకు కట్టేసి నిర్బంధించారు. అంతటితో ఆగకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ, డబ్బులు ఇవ్వకపోతే ఊరేగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రాణభయంతో వసంతకుమారి.. ఫైనాన్స్ కేసు తేలకపోతే తన భూమి అమ్మైనా డబ్బులు చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో గంట తర్వాత ఆమెను వదిలిపెట్టారు. ఈ ఘటన ఈ నెల 7వ తేదిన జరగ్గా, ఈరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా అంగన్వాడీ టీచర్లు అందరు కలిసి నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఈరోజు ధర్నా నిర్వహించారు. వసంత కుమారి పై దాడికి పాల్పడిన వారి పై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



## కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

### -బాధ్యులపై చర్యలు

**టి మీడియా, ఏప్రిల్ 9, వరంగల్ :** వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. సోషల్ మీడియాలో సీనియర్లపై కామెంట్స్ చేసిన థర్డ్ ఇయర్ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ కమిటీ చర్యలకు సిఫారసు చేసింది. వాటిని కళాశాల అమలు చేసింది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం వాట్సాప్ గ్రూప్‌లో సీనియర్లపై కామెంట్ చేశారని ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో థర్డ్ ఇయర్ విద్యార్థులు మోకాళ్లపై కూర్చోబెట్టారు. బాధిత విద్యార్థులు ఈ విషయాన్ని కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీకి పిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కమిటీ విచారణ చేపట్టి కారకులను మూడు నెలల అకడమిక్ సస్పెన్షన్, శాశ్వత హాస్టల్ వసతిని రద్దు చేస్తూ చర్యలకు సిఫారసు చేసింది. కమిటీ సిఫారసులను కళాశాల అమలు చేసింది. అయితే, దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.




## మొక్కజొన్న రైతులను ముంచిన వాన

### - 105 హెక్టార్లలో దెబ్బతిన్న పంట

**టీ మీడియా ,ఏప్రిల్ 9 ,ఏలూరు :** జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. అకాల వర్షం కారణంగా వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట మొత్తం నేలవాలింది. మరో పదిరోజుల్లో కోతకోసి పంట అమ్ముకుంటారనగా ఒక్కసారిగా కురిసిన వర్షం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. రైతన్నలకు నిరాశ మిగిల్చింది. ఒకవైపు పొలాల్లో నేలకొరిగిన మొక్కజొన్న, మరో వైపు కల్లాల్లో తడిసిన కండెలు చూసి రైతుల కళ్లు చమర్చుతున్నాయి. కాలం కాని కాలంలో కురిసిన వర్షం తమను దిక్కుతోచని స్థితిలో పడేసిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని కర్షకులు కోరుతున్నారు.



### అకాల వర్షంతో నష్టం

గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో భిన్న వ్షతావరణం నెలకుంటోంది. వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో కూడా తెలియడంలేదు. విపరీతమైన ఎండ అంతలోనే మబ్బులు పట్టి వర్షం కురుస్తోంది. ఇలా కాలంకాని కాలంలో కురుస్తున్న వర్షాలు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తున్నాయి. క్షణాల్లో మారిపోతున్న వాతావరణం చూసి పంట ఏదైనా రైతులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురవగా ఆ గాలుల ధాటికి పెదవేగి మండలంలో వందలాది ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. మరో పదిరోజులు గడిస్తే మొక్కజొన్న కోత పూర్తవుతుందనగా ఇంతలో అకస్మాత్తుగా కురిసిన గాలివాన మొత్తం పంటను నేలపాలు చేసింది. మండలంలో రబీ సీజన్?లో దాదాపు 5821వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా ఇప్పటికే సగం పంట మాసూళ్లు పూర్తయ్యాయి. ఈ తరుణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మొక్కజొన్న చేలు చాపలా నేలనంటుకున్నాయి. ఎకరానికి 40 నుంచి 50 మంది కూలీలు అవసరం : సాధారణంగా మొక్కజొన్న పంట కోతకు ఎకరానికి సగటున 25 మంది కూలీలు అవసరం కాగా ఇప్పుడు నేలకొరిగిన కండెలను కోసేందుకు 40 నుంచి 50 మంది కూలీలు అవసరమవుతారని రైతులు చెబుతున్నారు. దీంతో ఇప్పటిదాకా ఎకరానికి విత్తనాలు, ఎరువులు, బలాలు, కూలీల రూపంలో రూ.80వేలకు పైగా ఖర్చు చేయగా ఇప్పుడు నేలకొరిగిన పంటను కాపాడుకునేందుకు మరోసారి పెట్టుబడులు పెట్టాలని మొక్కజొన్న రైతులు వాపోతున్నారు. మరోవైపు కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు వర్షానికి తడిసి మొలకులు వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన కండెలను కంపెనీలు కొనుగోలుచేయవని ఒకవేళ చేసినా సగానికి సగం ధర తగ్గించి తీసుకుంటాయని దీంతో ఆరుగాలం పడ్డ కష్టమంతా వృథా అయిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### 105 హెక్టార్లలో దెబ్బతిన్న మొక్కజొన్న

జిల్లాలో మొత్తం 19 గ్రామాల్లో 105 హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేయగా మొత్తం 223 మంది రైతులు నష్టపోయారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా గాలివాన బీభత్సం సృష్టించిందని కోసిన పంటను కాపాడుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. నేలకొరిగిన పంట నుంచి కండెలు కోసేందుకు కూలీలు రావడం లేదని వచ్చినా కూలీ అధికంగా అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు. ఉపాధి హామీ కూలీలను వ్యవసాయానికి అనుసంధానం చేస్తే ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలని రైతులు కోరుతున్నారు.

## మత్స్య సాగుతో ఆర్థిక అభివృద్ధి

### -డాక్టర్ బి శ్రీనివాసరావు

**టీ మీడియా ,ఏప్రిల్ 9 ,కూసుమంచి:** ఆధునిక విధానాలతో చేపలు సాగు చేస్తే, అధిక ఆదాయం పొంది ఆర్థిక అభివృద్ధి సాధించ వచ్చని సూర్యాపేట జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. భారత వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారముతో పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో చేపల సాగుపై గురువారం శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. మత్స్యకారులు, మత్స్య రైతు ప్రతినిధులకు మూడు రోజులపాటు జరుగు శిక్షణా తరగతులను డాక్టర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. మత్స్య పరిశోధన శాస్త్రవేత్తలు సూచిస్తున్న విధానాలు పాటించి చేపల సాగు చేస్తే, బయో ఫ్లాక్ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీనివాసరావు కోరారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త శ్యాం ప్రసాదు మాట్లాడుతూ చేపల సాగుకు ప్రభుత్వాలు సబ్సిడీ సౌకర్యంతో,ప్రత్యేక రుణాలు అందిస్తున్నాయని ఈ అవకాశాన్ని సాధారణ, మధ్య తరగతి మత్స్య రైతులు, మత్స్యకారులు వినియోగించుకోవాలని కోరారు. యంగ్ ప్రొఫెషనల్ బానోతు దివ్య మాట్లాడుతూ చేప మాంస ఆహారం మానవ జీవితంలో ఎంతో ఆరోగ్యమైందని, అందుకు చేపల సాగు కోసం ప్రాధాన్యతనివ్వాలని కోరారు. బయో ఫ్లాక్ విధానం ద్వారా తక్కువ విస్తీర్ణం, తక్కువ నీటితో, పలు రకాల తక్కువ వ్యయంతో చేపల సాగు చేయవచ్చని చెప్పారు మత్స్యకారులు, మత్స్య రైతులు ఆర్థిక పరిపుష్టి పొందేందుకు చేపల సాగు స్థితిగతులపై దివ్య సవివరంగా శిక్షణ తరగతులు బోధించారు. మత్స్య శాస్త్రవేత్త బి రవీందర్ మాట్లాడుతూ చేపల సాగు విధానము లో సమీకృతంగా కోళ్లు, గొర్రెలు, వరి సాగు చేయవచ్చని చెప్పారు. మత్స్య పరిశోధన శాస్త్రవేత్త శాంతన్న మాట్లాడుతూ బయో ఫ్లాక్ ద్వారా చాపలు సాగు చేసి అధిక ఆదాయం పొందేందుకు, సాగు కోసం అవసరమైన స్థలం ఎంపిక ,విద్యుత్తు, ఆహార పోషణ ,మేలుకువలు ,మేత యాజమాన్యం తదితర వాటి గురించి సవివరంగా చెప్పారు. ఈ కార్యక్రమములో మత్స్య పరిశోధన శాస్త్రవేత్తలు అరుణ్, సిగ నాగరాజు, యంగ్ ప్రొఫెషనల్ బానోతు దివ్య తదితరులు పాల్గొన్నారు.




మండల / నియోజక వర్గం /
జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
epaper,www.tmedia.net.in

డిజిటల్ మీడియా మిత్రులకు ఆహ్వానం
కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డిజిటల్ మీడియా ఇతిక్స్ కోడ్ 2021 అమలు కోసం, మన ఆత్మ గౌరవం కోసం, జర్నలిస్టులుగా గుర్తింపు కోసం, ఖమ్మం గడ్డ నుండి ఉద్యమానికి కార్యాచరణ చేద్దాం
సమిష్టిగా చర్చించి కార్యక్రమం రూపొందిద్దాం
ఇట్లు
టీ-మీడియా కుటుంబం
తెలుగు డిజిటల్
సెల్ : 8919710365

## అంగన్వాడీ టీచర్ సస్పెన్షన్. కలెక్టర్ ఉత్తర్వులు జారీ

**టి మీడియా, ఏప్రిల్ 9, గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లా రామగుండం ఐసీడీఎస్ ప్రాజెక్టులో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, క్రమశిక్షణ ఉల్లంఘించిన అంగన్వాడీ టీచర్ స్వర్ణలతను సస్పెండ్ చేస్తూ గురువారం పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం సెక్టార్లోని అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న నాగమల్యాల స్వర్ణలత, తనపై అధికారుల పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడినట్లు ఫిర్యాదులు అందాయని, ఈ ప్రవర్తన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని, తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యమని ప్రాథమిక విచారణలో తేలిందని, ఉన్నతాధికారుల నివేదికలు అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి సదరు అంగన్వాడీ టీచర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ సస్పెన్షన్ ఆదేశాలు సదరు టీచర్‌పై పూర్తి స్థాయి విచారణ పూర్తై తదుపరి చర్యలు తీసుకునేంత వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, క్రమశిక్షణ తప్పినా కఠిన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




## బియ్యం తూకంలో తరుగుపై సివిల్ సప్లయ్ విచారణ

### గల్లీలో మధ్యవర్తుల మంతనాలు..

**టి మీడియా, ఏప్రిల్ 9,రామగుండం :** నగర పాలక సంస్థ 41వ డివిజన్ జవహర్ నగర్ లో గల ఓ రేషన్ దుకాణంలో బియ్యం తూకంలో తరుగు తీస్తున్నారన్న ఆరోపణలపై గురువారం సివిల్ సప్లయ్ అధికారులు విచారణ దాగుడుమూతలు విధంగా సాగింది. మధ్యాహ్నం రేషన్ దుకాణంకు వచ్చిన సివిల్ సప్లయ్ అధికారులు షాపులోని కాంటాను పరిశీలించారు. ఆ తర్వాత లీగల్ మెట్రాలజీకి సమాచారం అందించారు. అప్పటివరకు సివిల్ సప్లయ్ అధికారులు మాత్రం తామేం చేయలేమంటూ అక్కడే గల్లీలో కలియ తిరగడంతో విచారణను నీరుగార్చే ప్రయత్నం జరుగుతుందంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో కార్డుదారుడికి తూకంలో 4 కిలోలు తరుగు తీస్తూ మోసం చేస్తున్నాడంటూ స్థానికులు సివిల్ సప్లయ్ అధికారులకు వివరించగా, లీగల్ మెట్రాలజీ అధికారులు వస్తేనే బయట పడుతుందనీ, అప్పటి వరకు ఇక్కడే వేచి ఉంటామని సర్దిచెప్పారు. కొద్దిసేపటికే రేషన్ డీలర్ల సంఘం నాయకులు, మధ్యవర్తులు చౌకధరల దుకాణం వద్దకు చేరుకొని అధికారులతో మంతనాలు సాగించారు. సుమారు 2 గంటల పాటు సాగిన విచారణ గందరగోళంకు దారితీసింది. అసలేం జరుగుతుందో తెలియని పరిస్థితిలో స్థానికులు, ఫిర్యాదుదారులు అయోమయంకు గురయ్యారు. పత్రికలో కథనం రావడంతో అప్రమత్తమై కాంటాను సరి చేసి ఉంటారని స్థానికులు ఆరోపించారు. విచారణకు వచ్చిన సివిల్ సప్లయ్ అధికారులు కూడా ఏమి చేయాలో తెలియక ప్రక్కన గల్లీలోకి వెళ్లి ఓ ఇంటి వద్ద సేద తీరడం కనిపించింది. అప్పటికే మధ్యవర్తులతో డీలర్ తరపున వ్యక్తులు జరిపిన మంతనాలు కొలిక్కివచ్చినట్లు తెలిసింది. మధ్యవర్తుల మంతనాలు ఫలించినట్లు తెలుస్తోంది. దీంతో కలెక్టర్ స్వయంగా విచారణకు ఆదేశించాలని స్థానికులు పట్టుబట్టారు. లీగల్ మెట్రాలజీ సిబ్బంది రాకపోయేసరికి అందరూ ఇంటిదారి పట్టారు.



ముఖ్య సమాచారం
టి మీడియా (తెలుగు డిజిటల్..ఛాలెంజ్)
టి మీడియా (తెలుగు డిజిటల్ ) అనుమతులు కుటుంబ సభ్యులు(రిపోర్టర్స్ తోసహా) వివరాలు /హోదా /ఫోన్ నంబర్ తో సహా. ఈ పేపర్ క్రింద ప్రతీ రోజు పేపర్ తో పాటు కన పడే విదంగా.ఆన్లైన్ లోపెట్టటం ప్రారంభం అయింది.
ఈ పని ఎ మీడియా
సంస్థ /ఇతర కార్పొరేట్ సంస్థ లు వారు చెయ్యరు./చెయ్యలేదు.
టి మీడియా గురించి చులకన మాట్లాడే వారికీ ఇదే మా ఛాలెంజ్..మీ మీడియా ఏంటీ..? మీ రు ఏంటి అనే ప్రతీ ఒక్కరిని..టి మీడియా ఈ పేపర్ గూగుల్ లో ఓపెన్ చెసి చూసు కొండి .
-యూట్యూబ్ /ఇనిస్టా /వెబ్ సైట్ లో కూడా పై వివరాలు పెట్టటం జరుగుతుంది.